కథనం

కొత్తచదువు

సి. హెచ్. వేణు

దసరా సెలవులకు కాలేజీలు మూతబడినాయి. కాలేజీలు మూతబడడంతో హాస్టల్లు కూడా మూసేశారు.

సెలవుల్లో చేయాల్సిన కార్యక్రమాల గురించి హాయిగా ఊహించుకుంటూ, విద్యార్థులు హాస్టల్ ఖాళీచేసారు.

కాని హాస్టల్లో పండ్రెండుగురు విద్యార్థులు మాత్రం వెళ్ళకుండా వున్నారు.

వాళ్ళు పల్లెల్లో, పొలాలలో కష్టించి చెమటోడ్చి పంటలు పండించే రైతాంగం దగ్గరకెళ్ళి కొత్తచదువు చదువుకోవడానికి వెళ్ళాలనుకున్నారు. వాళ్ళు రాడికల్ విద్యార్థులు.

ఆ రాత్రి అందరూ కూర్చుని ఎక్కడికి వెళ్ళాలో చర్చించుకున్నారు. పండ్రెండు మంది మూడు దళాలుగా విడిపోయారు.

"కామ్రేడ్స్ మనం అనుకున్నట్లుగా మదనపల్లి తాలూకు, తంబళ్ళపల్లి తాలూకాకు క్యాంపెయిన్ వెళ్ళాలని నిర్ణయించిన వాళ్ళు తెల్లవారుజామున వెళ్ళిపోవడానికి రెడీగా వుండండి. మిగిలిన కామ్రేడ్స్‌ను తీసుకొనిపోవడానికి మనిషి వస్తాడు. కాబట్టి ఆయన వచ్చేంతవరకు వాళ్ళు కాచుకొని ఉండి, అతను ఎక్కడికి వెళ్ళాలని నిర్ణయిస్తే ఆ నిర్ణయాన్ని పాటించండి." అందరిలోకి పెద్దగా వున్న సీనియర్ విద్యార్థి సభ్యుడు దళాలుగా విభజించి కార్యక్రమం వివరించాడు.

రెండు దళాలు తెల్లవారుజామున్నే లేచి వాళ్ళు వెళ్ళవలసిన ప్రాంతాలకు వెళ్ళిపోయారు.

మూడవ దళాన్ని తీసుకొని పోవడానికి రావలసిన వ్యక్తి మరుసటి రోజు రాత్రికొచ్చాడు. పేరు 'రాజప్ప', యువకుడే. ఇరవై సంవత్సరాలకన్నా ఎక్కువ వయసుండదు. బాగా చురుకైన వాడు. చదువు వదలి పెట్టి విప్లవ రాజకీయాల్లో లీనమైనాడు.

వాళ్ళు వెళ్ళ వలసిన ఊరు 'రామిరెడ్డిగారి పల్లె'. ఆ ఊరు పుంగనూరు తాలూకాలో వుంది. పుంగనూరు నుండి చౌడేపల్లి మీదుగా ఆ వూరికి గవర్నమెంటు బస్సులు నడుస్తాయి. రైలు మార్గం వెళ్ళాలంటే ఉత్తరం పది మైళ్ళు వెడతే 'కలికిరి'

స్టేషనుంది. ఆవూరికి తాలూకా సెంటరు పుంగనూరే అయినా ఆవూర్లో వాళ్ళు ఎక్కువగా అన్ని పనులకు 'కలికిరి'కి వెళ్తారు.

• • •

'రాజప్ప' ఆ రాత్రి అక్కడే పండుకొని, తెల్లవారు జామున విద్యార్థుల దళాన్ని తీసుకొని, పాసింజరు రైలుబండి కొచ్చి కలికిరి స్టేషన్లో దిగారు.

నడచుకుంటూ ఊరిని సమీపించేటప్పటికి పదిగంటలయింది.

దూరం నుంచి చూస్తే ఊరు కనిపించకుండా, చింత వనంలాగుంది. ఊరిలో ఎక్కడ చూసినా చింత చెట్లే. ఇండ్లల్లోను, ఇండ్ల ముందు పైపు, అన్ని చోట్లా చింత చెట్లే. ఆ చింత చెట్ల మధ్యన అందంగా కట్టుకున్న పెద్ద మిద్దె, పెంకులతో కప్పిన వసారా, వరండాలో సోఫాసెట్టు, వైరుతో అల్లిన ఫ్రేమ్ కుర్చీలు, ఈజీ ఛైర్‌లు. ఇల్లు అందంగా వుంది. గొడ్ల నివాసానికి పెద్ద కొట్టాలున్నాయి. ట్రాక్టరుకు రేకులతో కట్టిన షెడ్డు. వనానికీ ఊరికి రాజులాగావున్న భూస్వామి 'గురునాధరెడ్డి'ది ఆ భవనం.

ఆ భవనానికి ముందు కొద్ది దూరంలో మట్టి రోడ్డు, మట్టిరోడ్డుకు పైభాగాన భూస్వామి భవనానికి ఎదురు ముఖంగా కాపలా కాస్తున్నట్లు రెండు మాలపల్లెలు. ఒకొక్క పల్లెలో యాభై యిండ్లు లెక్కన రెండు పల్లెల్ని కలిపి నూరు పూరిండ్లు కొట్టాలుంటాయి. ఆ రెండు పల్లెల్ని కలిపి భూస్వామి గురునాధరెడ్డి వాళ్ళ తాత పేరుతో 'రామిరెడ్డిగారి పల్లె' అని 'రెడ్డేరి పల్లె' అని రెండు విధాలుగా ఆ వూరిని పిలుస్తారు.

రామిరెడ్డి పల్లెకు ఏకఛత్రాధిపతి గురునాధరెడ్డి. రెడ్డి పేరంటే ఊరుఊరంతా గడగడలాడతాది. అతని మాటకు ఎదురు లేదు. గురునాధ రెడ్డిని చూడనోళ్ళు అతన్ని గురించి వింటే, అతను గంభీరంగా ఉంటాడనుకుంటారు. అతన్ని చూసిన తరువాత అనుకున్న రూపం తారుమారౌతుంది.

గురునాధరెడ్డి బట్టతల కల్గి, కళ్ళజోడు పెట్టి, జోడు మనుషుల్లాగా పైకి ఒక రూపం, లోపల ఒక రూపం కల్గిన రాక్షసుడు. నలభయి సంవత్సరాలున్న గురునాధరెడ్డి, మాలపల్లిలో డెబ్భై ఏండ్ల ముసలితాతనయినా 'ఒరేయి ముండాకొడుకా' అని పిలుస్తాడు. తన బిడ్డల్ని అందమైన పేర్లు పెట్టి నాజూకుగా పిలిచే నోరు, మాలపల్లి బిడ్డల్ని, చెల్లెళ్ళను ఈడొచ్చిన అక్కల్ని 'లంజల్లారా' అని తప్ప మరో విధంగా పిలవడు.

'రాజప్ప' విద్యార్థులకు భూస్వామి భవనాన్ని చూపించి, అతన్ని గురించి క్లుప్తంగా వివరించాడు.

అందరిని గంగులయ్య యింటికి పిల్చుకొని పోయాడు. ఆ సమయానికి గంగులయ్య భార్య నరసమ్మ యింటి దగ్గరే ఉంది.

"రాండన్నా లోపలికి రాండన్నా కూర్చుందురు" అంటూ నరసమ్మ అందరిని లోపలికి పిలిచి కూర్చోవడానికి ఈతచాపలు పరిసింది.

అందరికి తాగడానికి మంచినీళ్ళిచ్చి, వాళ్ళు తెచ్చిన సంచులు, పుస్తకాలు తీసుకెళ్ళి లోపల పెట్టింది.

"గంగులన్న ఎక్కడికెళ్ళినాడు, నరసమ్మక్కా" రాజప్ప

"పనికి పోయినాడన్నా. నాకు పానం బాగలేక నిల్సిపోయినానన్నా" నరసమ్మ వివరించింది.

గంగులన్న అంటె, రాజప్పకు చాలా గౌరవం. గంగులన్న మంచి కార్య కర్తగా మారగలడని రాజప్ప అంచనా. ఆ వూర్లో సంఘం పెట్టాలని పట్టుపట్టింది కూడా గంగులన్నే.

* * *

గంగప్ప అయిదువరకు చదువుకున్నాడు. ముప్పై సంవత్సరాలు వయస్సుం టుంది. ఇద్దరు ఆడపిల్లల తండ్రి. మాలపల్లిలో నలుగురిచేత మంచనిపించుకున్నాడు. ఏదైనా మంచి చెడ్డ అడగాలంటె, ముందునిలబడి ముఖాన్నే అడిగేస్తాడు.

దొంగ బాటు ఎవ్వారాలు చేసి, తగవులు పెట్టేవాళ్ళంటె అతనికి గిట్టదు. అందుకే అతనంటె యువకులు, పెద్దోళ్ళుకూడా గౌరవిస్తారు. అతని మాటంటె నలుగురూ వింటారు.

ఒకరోజు రాజప్ప పుంగనూరు నుండి కలికిరికి బస్సులో పోతావుంటె గంగులయ్య పరిచయమయ్యాడు.

మాటల సందర్భంలో భూస్వాముల ప్రస్తావన వచ్చి తంబళ్ళపాడు, వాయల్పాడు తాలూకాలలో రైతుకూలీ సంఘంచేసే పనుల గురించి, భూస్వాములకు వ్యతిరేకంగా తైతాంగం చేస్తున్న పోరాటాల గురించి రాజప్ప వివరించాడు. కలికిలో మీటింగు జరుగుతుంది. రమ్మని కరపత్రం యిచ్చాడు.

కలికిరిలో బస్సు దిగిన తరువాత గంగులయ్య రాజప్పను వదల్లేదు. ఇద్దరూ టీ తాగి, మరలా మాటలు పెట్టుకున్నారు.

"మా పక్కలకూడా రైతుకూలీసంగాలు పెట్టాలన్నా, మా వూరికి రాండన్నా, మా వూర్లోకూడా సంగం పెడ్తాం" అని చెప్పి, గంగులయ్య వాళ్ళ పల్లెల్లో గురునాధ రెడ్డి చేసే అన్యాయాల గురించి వివరించాడు.

ఇద్దరూ మాటల్లోపడి టైమ్ సంగతే మర్చిపోయారు. మధ్యాహ్నం అయి సూర్యుడు నెత్తిమీద కొచ్చాడు.

గంగులయ్యకు 'రాజప్ప'తో ఆ విధంగా పరిచయమై అప్పుడపుడు రామిరెడ్డి పల్లెకు రాను మొదలుపెట్టాడు. వచ్చినప్పుడల్లా రైతుకూలీ సంఘం గురించి, పోరాటాన్ని గురించి వివరిస్తూ వుండేవాడు. ఊర్లో ఇంకా నారాయుడు, చెంగప్ప నర్సయ్య లాంటి యువకులు, రంగయ్య, ఎల్లయ్య తాతలాంటి పెద్దోళ్ళుకూడా పరిచయ మయ్యారు. అందరూకూడా సంఘం పెట్టుకోవడానికి బాగా ఆసక్తి చూపేవారు.

విద్యార్థులచేత పాటలు పాడి, ప్రచారం చేపించి సంఘం పెట్టాలనుకున్నాడు రాజప్ప. విద్యార్థులకు సెలవులు రావడంతో, అన్ని సమయాలు కలిసొచ్చి, అదేమంచి సమయం అనుకొని, విద్యార్థుల్ని పిల్చుకొనివచ్చాడు రాజప్ప.

*　　　*　　　*

మధ్యాహ్నం విద్యార్థులు ఒకొ్కక్కరు ఒకొ్కక్క యింటికెళ్ళి, వాళ్ళు పెట్టిన అన్నం తిన్న తర్వాత ఊరును సర్వే చేయడానికి కదిలారు.

చింతచెట్లకు కాయలు దండిగా యిరగ్గాసి ఉన్నాయి. ఊర్లో రెండు వందలకు పైగానే చింతచెట్లున్నాయి. మాలపల్లిలో ఇండ్లల్లో ఉండే చింతచెట్లకు కాసిన కాయలు కూడా భూస్వామికే చెందుతాయి.

ఒక్క కాయకూడా ఇంటిగల్ల వాళ్లు తగలకూడదు. రాలిన కాయలన్ని ఏరి, గురునాధరెడ్డి ఇంటిదగ్గర కుప్పపోయాలి. ఎవరైనా చింతకాయలు తీసుకొని, తిని నారని తెలిస్తే తినిన పులుసు కక్కేదాకా, చెట్లకుకట్టి, కొట్టిస్తాడు.

మాలపల్లె నుండి, తూరుపుకొండకు దిగంతాల, కంటికి చూపు అనినంతవరకు గురునాధరెడ్డి భూమి, చెరువుకింద, కుంటకింద భూమంతా ఆయనపాలే. మాలపల్లిలో ఒకరికో యిద్దరికో ఎలిభూమి కొంత, చెరువుకింద కొంత కలిపి, ఒకెకరమో, అరెకరమో ఉన్నా, ఆ భూమి కూడా భూస్వామికి బాకీకింద, వడ్డీలకి, ఆయనవైపే వుంటుంది.

461

గురునాధరెడ్డికి ఆరు నూరెకరాల భూమున్నా, ఇంతభూమి చాలక, ఎక్కడ పరంబోకి భూమున్నా అవన్నీ ఆయన ఆక్రమణకిందే వుంటాయి. ఇక మిగిలిందల్లా కూలోళ్ళకు వాళ్ళ రెక్కలకష్టం మాత్రమే. పనికిపోతే రెండు మెతుకులు తినాల. లేకుంటె పస్తులుండాల. పొద్దు పొయ్యేదాకా పనిచేస్తే వాడిచ్చేది రెండు రూపాయలు మాత్రమే.

గురునాధరెడ్డికి ప్రతి సంవత్సరం ఆదాయం పెరుగుతున్నా కూలీలకిచ్చే కూలి మాత్రం రెండురూపాయలే. ఎక్కువ కూలి కావాలని ఎవడన్నా అడిగితె, వాడి బతుకు నాశనమయినట్లే. ఆ భయంతో ఎవ్వడుకూడా ఎక్కువడక్కుండా, 'ఆయ నిచ్చిన కాడికి ఈ నీలేరా' అని నోరెత్తకుండా తీసుకుంటారు.

* * *

పడమటివైపు కొండలల్లో వాలిపోతున్నట్టుగా సూర్యుడు అస్తమిస్తున్నాడు. చేలల్లో పనులు ముగించుకొని కూలీలు ఇండ్లదారి పట్టినారు.

విద్యార్థులు వాళ్ళ బాధలు పంచుకోవడానికి, ఎదురేగినట్లు వాళ్ళొచ్చే దారిలో రెండు పల్లెల మధ్యన ఎత్తుగావున్న బండ గుట్టమీదకు చేరారు. వాళ్ళ మనసులోని మాటల్ని, పాటలుగా పాడి వినిపిస్తున్నారు.

"బతుకులేమొ ఎండిపాయె మొండిమాను బతుకులాయె
రాజిగో ఈ రాజ్యమేలెటోళ్ల చావ ....
....
రేపటిపూట తలుచుకుంటె గుండెలు ఝలు ఝల్లుమనె
రాజిగో ఈ రాజ్యమేలెటోళ్ల చావ"
అంటూ పాడుతున్నారు.

ఇండ్లకుపోయే కూలోల్లంతా బండమీద ఆగి పాటలు వింటున్నారు. దినదిన గండంగా ఈడ్చుకొస్తున్న బాధల్ని పాటలద్వారా వినిపిస్తావుంటె బాధలతో నలుగు తున్న కూలీల మనసుల్ని తడిమినట్లయింది. పాటలు పాడుతున్న విద్యార్థుల్ని వింతగా చూస్తూ ఆశ్చర్యపోతున్నారు.

"అమ్మల్లారా, అక్కల్లారా, అయ్యల్లారా ఈ రోజు రాత్రికి బండమీద రాడికల్స్ మీటింగు జరుపుతారు. పేదోల్ల కష్టాలమీద పాటలు పాడి వినిపిస్తారు. మన కష్టాలకు కారణాలు తెలిపి, దరిద్రంతో నలిగే మన బతుకులు ఘోరాలంటే

ఏమి చేయాలో వివరిస్తారో, కాబట్టి అన్నాలుతిన్నాక అందరూ బండ మీదకురావాలని కోరుతున్నాము" పాటలు వినడానికి గుమికూడిన వారికి విద్యార్థి గట్టిగా చెప్పాడు.

ఇదివరకే పక్క తాలూకాలలో రాడికల్స్ చేస్తున్న కార్యకలాపాల గురించి వింటూ వచ్చిన కూలీలకు, ఆ రోజు వాళ్ళ వూరిని వెదుక్కుంటూ రావడంతో, సంఘమోల్ల గురించి తెలిసినకాడికి, ఒకరికొకరు చెప్పుకుంటూ, ప్రతియింట్లోను చర్చ ప్రారంభమైంది.

విద్యార్థులే గాకుండా, ఊర్లో యువకులతో కలసి గంగులయ్య యింటింటికీ వెళ్ళి "సంఘం గురించి వాళ్ళుచెప్పే విషయాలిని, మనం సంఘం పెట్టుకోవాల. కాబట్టి అందరూ బండమీదకు రాండి" అంటూ చెప్పుకుంటూ పోయారు.

ఊర్లో అందరూ కూడా ఉత్సాహంగా ఉన్నారు. ఊరికి కొత్తమార్పు వస్తున్నట్లు యువకులు సంబరపడుతున్నారు.

ఆకాశంలో నక్షత్రాలు మిలమిల మెరుస్తుంటె, చంద్రుని పాలనురుగు కాంతికి నల్లని మబ్బులు మాయమౌతున్నాయి. నీలాకాశం తేటంగా వుంది. రాడికల్ విద్యార్థులు పిండారబోసిన వెన్నెల్లో, బండమీద నిలబడి మౌనంగా వింటున్న మాలపల్లి ప్రజలతో తామెవరైంది, వెన్నెలే సాక్షిగా చూపుతూ, గొంతెత్తి పాడుతూ పాటలో చెపుతున్నారు.

"ఎవరీ పిల్లలమ్మ ఎన్నెలో – ఎన్నెలా
ఏ తల్లి బిడ్డలమ్మ ఎన్నెలో – ఎన్నెలా
ఏ యింటి వెలుగులమ్మ ఎన్నెలో – ఎన్నెలా
....
....
రాడికల్ పిల్లలమ్మ ఎన్నెలా ....

వాళ్ళ రణంచేసె బిడ్డలమ్మ ఎన్నెలా ...." అంటూ పాడుతున్నారు. పాట అయిపోయిన తర్వాత, విద్యార్థి దళనాయకుడు ఉపన్యాసం ప్రారంభించాడు.

"అమ్మల్లారా, —అయ్యల్లారా మీముందు నిలబడిన మేము, భూస్వాముల బిడ్డలం కాదు. మేం కష్టజీవుల బిడ్డలం, నక్సలైట్ బిడ్డలం. మేము చదువుకుంటున్న బడిపిల్లలం.

బడిపిల్లలు పల్లెలు కొస్తున్నారంటే మీకందరికి వింతగా ఉండొచ్చు. ఎందు కంటె యింటినుండి పెద్దోళ్ళు పంపిస్తే, తిని బళ్ళల్లో హాయిగా చదువుకోనేటోళ్ళకు పల్లెల్ని పట్టించుకొనే పని ఏ ముంటుందని. లేకుంటె ఒకవేళ వాళ్ళొచ్చినా ఎలక్షన్లలో ఓట్లడగడానికి వచ్చిన వాళ్ళను చూసుంటారు. అయితే మేమొచ్చింది ఓట్లడగ టానికి కాదు. ఆ ఓట్లమీద మాకు నమ్మకంలేదు. మేమొచ్చింది, మనపేద బతుకులు, దరిద్రం బతుకులు మారాలంటే ఏం చేయాలో చెప్పడానికి వచ్చినాము. ఎందు కంటె మేముకూడా రైతాంగం బిడ్డలమే కాబట్టి. మీరు కష్టపడి పనిచేసిమమ్మల్ని చదివిస్తున్నారు. మామీద ఆశలు పెట్టుకుంటున్నారు. అయితె అవి నెరవేరడంలేదు. పెద్ద పెద్దచదువులు డాక్టరు కోర్సులు, ఇంజనీరింగ్ కోర్సులు అందరికి చదవడానికి వీలులేదు. అవి డబ్బు న్నోళ్ళకే పరిమితమైనాయి. మిగతావాళ్ళు కూడుపెట్టని చదువులుచదివి నిరుద్యోగులై పోయి, పిచ్చోళ్ళగా తయారవుతున్నారు. కట్నం బాధలు పడలేక ఆడబిడ్డలు ఆత్మ హత్యలు చేసుకుంటున్నారు. విషంమింగి చస్తున్నారు. మాబతుకులట్లుంటె, పల్లెల్లో భూతల్లిని నమ్ముకున్న మీసంగతి చెప్పనక్కర్లేదు. పొలంలో దినమంతా పనిచేసి, బురదలో పొర్లాడి, చెమటను రక్తంగాపారించి, రతనాల పంటలు పండిస్తే, పండించే వాళ్ళు పస్తులుంటన్నారు. పనిచేయని భూస్వాములు మాత్రం, ఒళ్లు కదల్చకుండా చెమటోర్చకుండా నున్నగా కడుపులు పెంచుకుంటున్నారు. కష్టజీవుల కడుపులు కొట్టి వాళ్ళు కోటీశ్వరులవు తున్నారు. వాళ్ళే మంత్రులై, ప్రభుత్వమై రాజ్యమేలు తున్నారు. ఆ విధంగా ఎందుకయిందో కారణాలు తెలుసుకున్నాం. కష్టపడేవాడికి కూడెందుకు దక్కటం లేదో తెలుసుకున్నాం. మాకు కూడుపెట్టని చదువులు, దొంగలెక్కలురాసే చదువులొద్దని, కూడుపెట్టే చదువులు కావాలని, చదువుకొనే వాళ్ళనంతా ఒక్కటిగా చేసి విద్యార్థి సంఘాలుపెట్టి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నాం. సెలవు లల్లో రైతాంగం దగ్గర కొత్త చదువులు చదవాలని, మీ దగ్గరనుండి నేర్చుకొని ఈ బాధలు పోవాలంటె ఏం చేయాలో మాకుతెలిసింది మీకు చెప్పడాని కొచ్చినాము. పల్లెల్లోఉండే కూలీలు పేదరైతులు, కష్టపడే కార్మికులు, కులాలు మతాలపేరుతో విడి పోకుండా వాటినివదిలిపెట్టి అందరూ ఒక్కటిగా ఐక్యమై కూలి సంఘాలు పెట్టుకొని భూస్వాములుచేసే అన్యాయాలకు వ్యతిరేకంగా, దోపిడీ రాజ్యంతో పోరాడి, పేదోడి రాజ్యాన్ని దున్నె వానిదేభూమి కావాలని, ఊరు ఊరు, పల్లె, పల్లెకు తిరుగుతున్నాము, సంఘాలు పెట్టుకొమ్మని చెబుతున్నాం. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్

464

ఖమ్మం, వరంగల్ జిల్లాలలో రైతుకూలీ సంఘాలు పెట్టుకొని భూస్వాములతో పోరాడు తున్నారు. అన్యాయంగా పోగొట్టుకున్న భూముల్ని తిరిగి సంపాదించు కుంటున్నారు. బంజరుభూముల్ని ఆక్రమిస్తున్నారు. దోపిడిప్రభుత్వాన్ని కాపలాకాసే పోలీసులతోకూడా పోరాడు తున్నారు. వాళ్ళహక్కుల కోసం తెగించి పోరాడు తున్నారు."

విద్యార్థి దళనాయకుడు చెబుతూవుంటె, అందరుశ్రద్ధగా వింటున్నారు

ఒకపెద్దాయన తనకుకల్గిన అనుమానాన్ని చెప్పడానికి లేచాడు.

"చూడు నాయనా నీవుచెప్పినేటియన్ని మంచి సంగతులే. ప్రపంచంలో జరిగే దంతా పూసగుచ్చినట్టు చెప్పినావు అదికాదసలా. అయితే నాకోకనుమాన ముంది. పెద్దోణ్ని అడుగుతుండా కోపగిచ్చుకోకుండా చెప్పు. మనగవరమెంటు, ఎక్కడపడితే అక్కడ పేదోల్లకు, ఏమేమో చేసేత్తన్నామని, మైకుల్లో, రేడియాలల్లో చెప్తన్నారు కదా, మరినువ్వు చెప్పేసంగతులుగాని, అదేదో ఆదిలాబాదు, కరీమునగర్ అక్కడ సంగాలు పెట్టుకుని భూములు సంపాయిచ్చే సంగతి యాడగాని చెప్పలేదేమని ? లేకుంటే సంగాలుండేది అక్కడోక చోటనేనా, ఇంకా మనప్రక్కల కూడా ఏమన్నా సంగాలుండాయా, ఆ సంగతులుకూడా చెబితే బాగుంటాది". ముసలోడు మంచిసంగ తులు అడిగినాడనుకున్నారు జనం.

ముసిలాయన పేరు 'ఎల్లయ్య' తనబతుకంతా భూస్వాములయింట్లో సేద్యగాడి గానే ఎల్లబారింది. ఒంటిలో రక్తమున్నంతవరకు పనిచేశాడు. రక్తముడిగి మోకాళ్ళ మోదుగ కట్టుకుపోవడంతో పనిచేయలేక పోయాడు. ఇప్పుడు మిగిలిన జీవనాధారం చేత్తో నులకతాడులు పేనుకొని బతకడమే.

విద్యార్థి ముసిలాయన్న అడిగినదానికి జవాబు చెప్పడానికి లేచాడు.

"ఆ తాత అడిగింది చాలా మంచి విషయాలడిగినాడు. ఎందుకంటె గవర్న మెంటువాళ్ళు ఎప్పుడుకూడా పేదోళ్ళకు ఏదేదో చేస్తున్నట్టు చెబుతూ ఆశచూపిస్తారు. ఏవయితే వాళ్ళుఅమలు పరచరో, వాటిని గురించి ఎక్కువగా చెబుతారు. ప్రజల్ని మభ్యపరుస్తారు. మాయచేస్తారు. వాటిని గురించి బాకాలూదడానికి ప్రభుత్వం చేతిలో సాధనాలు, రేడియోలు, టి.విలు, పత్రికలున్నాయి. వాటికిప్రభుత్వాన్ని పొగుడుతూ, అబద్ధాలు చెప్పేకార్యక్రమం తప్ప మరేంలేదు. కాబట్టి ప్రజా పోరాటాల గురించి రేడియోలుగాని, పత్రికలుగాని సరిగాచెప్పవు.

465

ఇక భూమికోసం జరుగుతున్న పోరాటాలందాము. అవి ఒక్క ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలలోనేకాదు, రాష్ట్రమంతటా జరుగుతున్నాయి. మన చిత్తూరు జిల్లాలోకూడా రైతుకూలీ సంఘాలు పెట్టుకొని పోరాడుతున్నారు. రైతు కూలీలు కూలిరేట్లు పెంచు కుంటున్నారు. తంబళ్ళపల్లి, మదనపల్లి, వాయల్పాడు మొలకల చెరువు తాలూకాలలో భూస్వాములు చేస్తున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. వడ్డీవ్యాపారస్తుల అక్రమాలను, చౌకదుకాణాల డీలర్ల అక్రమాలను నిలదీసి అడుగుతున్నారు. బంజరు భూములు ఆక్రమించు కుంటున్నారు. మన సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని తెలుసు కొంటున్నారు. కాబట్టి మీపైపుకూడా, మీకున్న సమస్యలు పరిష్కరించు కోవాలంటె, సంఘాలు పెట్టుకోని, పోరాటబాటలో వాళ్ళతో, కలవాలని కోరుతున్నాము". విద్యార్థి తనమాటల్లో చెప్పవలసినదంతా చెప్పి కూర్చున్నాడు.

తర్వాత గంగులయ్య మాట్లాడడం ప్రారంభించాడు.

"వయస్సులో మనకన్నా ఎంతో చిన్నోళ్లయినా మనబతుకుల గురించి, తెలీని సంగతులెన్నో చెప్పినారు. తంబళ్లపల్లి, మదనపల్లి, వాయల్పాడు తాలూకాలలో పోరాటాల గురించి, మనచెవిన అప్పుడప్పుడు పడతూనే ఉన్నాయి. ఈ పొద్దు వాటి గురించి యింకా బాగా వివరంగా తెలుసుకున్నాం. అయితే మనంకూడా వాల్లమాదిరి గానే సంగం పెట్టుకోవాలను కుంటానే ఉంటాము. అదట్నేజరిగి పోతాంది. ఇపుడు మన బడిపిల్లోల్లు సంగంగురించి ఎన్నోసంగతులు చెప్పి మన అనుమానాలన్నీ పోగొట్టినారు. ఎట్టాగు ఈ పొద్దు అందరం బండమీద కూడినాము. మన బడిపిల్లోల్ల చేతుల మీదగానే మనూర్లో సంగం పని మొదులు పెట్టదాము. అందుకనే సంగంలో చేరే వాల్లంతా, ఈ బుక్కుల్లో పేర్లు రాపించెతే మొదలు బెట్టినట్టవుతాది " గంగులయ్య నోటుపుస్తకాన్ని విద్యార్థుల చేతికిచ్చాడు- పేర్లు రాయడం కోసం.

గంగులయ్య అభిప్రాయంతో అందరూ ఏకీభవించారు.

ఎల్లయ్య, రంగయ్యతాత, పెద్దోళ్ళు అంతా యువకులు చేస్తున్నదానికి మద్ద తిచ్చి అంగీకరించారు.

విద్యార్థి నాయకుడు నోటుబుక్‌లో 'రైతుకూలీసంఘం' పుంగనూరు తాలూకా, రామిరెడ్డిపల్లె అని రాసి, సభ్యులపేర్లు రాశాడు. అందరూ కలసి 'గంగులయ్యను' సంఘానికి అధ్యక్షునిగా, గుర్రప్పను కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

466

"రైతుకూలీ సంఘం వర్థిల్లాలి
దున్నేవానికే భూమి
విప్లవం వర్థిల్లాలి"

విద్యార్థుల గొంతుకు రైతుకూలీల గొంతులు తోడై నినాదాలు దద్దరిల్లాయి. కొండలుతాకిన నినాదాలు ధ్వని పలికాయి.

చింతతోపు మిద్దెలో పరుపుమీద హాయిగా నిద్రిస్తున్న భూస్వామికి తనపునాది కదిలిపోతున్నట్లు, పేదల్ని పీడించి కట్టుకున్న భవనం కూలిపోతున్నట్లు కలగంటూ, రైతుకూలీల నినాదాలు చెవులకు సోకడంతో ఉలిక్కిపడి లేచి, కళ్ళు నులుముకుంటూ బయట వరండాలోకొచ్చాడు.

వెన్నెల పిండారబోసినట్లుంది, చెట్లకింద నీడలు కదులాడుతున్నాయి. బండ మీద గుమికూడి కూర్చున్న జనం తన నిద్రమత్తు కళ్ళకు మసగ్గా కనుపించారు. చెవులకు రాసుకొనిపోతున్న చల్లగాలిలోంచి పాట క్షీణంగా వినిపిస్తావుంది.

"రండిరో కూలన్నా సంగం పెడదాము
సంగతేందో చూద్దాము రండిరో"

అంటూ పాడుతున్న పాటతో సమావేశం ముగించుకొని బండమీద నుంచి జనం కదిలివస్తుంటె, భూస్వామి గురునాధరెడ్డికి ఒల్లు గగుర్పొడిచి, కళ్ళు బైర్లు కమ్మినట్లయింది.

* * *

ఉదయాన్నే లేచి మాలపల్లి పిల్లోళ్ళు చింతచెట్లకిందకు పరుగెత్తారు. రాలిన చింతకాయలన్ని ఏరి, రోజుమాదిరిగానే గురునాధరెడ్డి ఇంటిదగ్గర కుప్పపోసి వచ్చారు.

ఎల్లయ్య కూతురు చిన్నబిడ్డ 'లచ్చుమక్క' మాత్రం, ఏరిన కాయలు కొన్ని మాత్రమే అందరితో పాటు కుప్పలోపోసి, మిగిలిన కాయలు చెట్టుకింద దాచిపెట్టి, ఆకులు కప్పింది.

మిట్ట మధ్యాహ్నం ఎండ తీక్షణంగా కాస్తావుంది. ఎండాకాలం కాకపోయినా ఎండమాత్రం మాడకాగుతా వుంది. లచ్చుమక్క భూస్వామి యింటివైపు వరండాలో ఎవరూలేరని చూసి, దాచిపెట్టినవి కాయలు ఎత్తుకురావడానికి చెట్టుకాడకు పరుగెత్తింది. కాయలు ఒళ్ళో పోసుకొని రోడ్డెక్కేటప్పటికి సీతాదేవికి, రావణాసురుడు ప్రత్యక్ష

మైనట్లు, టౌనుకు పోయివస్తున్న గురునాథరెడ్డి, సైకిల్ మోటారు మీద ప్రత్యక్షమైనాడు.

గురునాధరెడ్డిని చూస్తూనే, అచ్చమక్క బిత్తరపోయి, చేతిపట్టు నుండి ఒడి జారవిడిసింది. ఒళ్ళో చింతకాయలు, పళపళమని కిందపడ్డాయి. ఒళ్ళంతా చెమటపట్టి గడగడ వణుకుతూ నిలబడింది.

గురునాధరెడ్డి సైకిల్ మోటారుదిగి స్టాండువేసి "ఏమే పిల్లలంజా ముంతా కాయలు మీ తాత సొమ్మనుకున్నావ, నీయమ్మ ...." అంటూ జుట్టుపట్టి ఈడ్చి, చెంపలమీద కొట్టి, ముందుకు తోపుతోశాడు. అచ్చమక్క ఆ తోపుకు విసరకపోయి, బోటు రాతిమీదపడి స్పృహతప్పింది. తలనుంచి రక్తం రాకపట్టింది.

దూరంగా చెట్టుకింద ఆడుకుంటూవున్న పిల్లలు, ఈ తతంగం అంతా చూసి పరుగెత్తుకొచ్చారు. రక్తంలో స్పృహతప్పి వున్న అచ్చమక్కను చూసి ఇండ్లల్లో వాళ్ళకు, చేలల్లో పని చేసేటోల్లకు చెప్పిరావడానికి పిల్లలు ఎల్లినారు.

పెద్దోళ్ళు వచ్చేలోపలే గురునాధరెడ్డి మెల్లగా అక్కడినుండి జారుకున్నాడు.

గంగులయ్య పడిపోయిన బిడ్డను భుజాన్నేసుకొని, గురునాధరెడ్డి ఇంటిదగ్గరకు వెళ్ళాడు. ఆడోళ్ళు, మొగోళ్ళు వూర్లో జనమంతా కూడి అక్కడికే చేరారు.

గంగులయ్య బిడ్డను వరండాలో పెట్టాడు. "ఎధవ చింతకాయలకోసం బిడ్డను రక్తమొచ్చేట్టుగా కొట్టినావు. అసలు చింతచెట్లకు నువు నీళ్ళుపోసి పెంచినావా ? మా యిండ్లల్లో చెట్లకాయలన్నీ ఇన్నిరోజులు నువ్వే తిన్నావు. ఈ రోజునుంచి మేము చింతకాయలు నీకిచ్చేదిలేదు. ఎవరిండ్లల్లో కాయలు వాళ్ళే ఏరుకుంటారు. మా పిల్ల కాయలమీద చేయి చేసుకుంటే మేమొప్పుకోం. ఈ పొద్దు మాబిడ్డ పానానికేమన్న జరిగితే నీ అంతు చూస్తాం" గంగులయ్య మాటలకు ఒకదానికి కూడా జవాబివ్వకుండా గమ్మున లోపలికెళ్ళిపోయాడు గురునాధరెడ్డి.

భూస్వామిదే ట్రాక్టరు తీసుకొని, బిడ్డను ఆసుపత్రికి తీసుకుపోయారు.

ఆడవాళ్ళు మాత్రం గురునాధరెడ్డి ఇంటిముందు నిలబడి, ఎన్నిరకాల తిట్లుంటాయో అన్ని తిట్లు తిట్టారు.

"మా కడుపులు కాల్చ నువ్వెన్నిరోజులు ఈ బతుకు బతుకుతావురా, ఆకిరికి మా బిడ్డల్నికూడా చీల్చక తింటన్నావు కదరా, ఆ బిడ్డను కొట్టను నీ చేతులెట్లాడినాయిరా, రాచ్చేసుడా ? నీ చేతల్లో పురుగులుపడ, నీ వంశం కూలిపోను, నిన్ను కలరాచ్చెత్తకపోను" అంటూ ఆడోల్లు ఇంటిమీద దుమ్మెత్తిపోసి తిట్టిపోయారు. 468

* * *

రాత్రి పూర్లో అందరూ సమావేశమయ్యారు. బిడ్డ క్షేమంగా తిరిగొచ్చేదాకా ఎవరూకూడా పనికి పోకూడదని నిర్ణయించుకున్నారు.

ఆసుపత్రికి వెళ్ళినవాళ్ళు ఎవరూకూడా తెల్లవారి రాకపోయేటప్పటికీ, మాల పల్లిలో అందరూ పనులకు వెళ్ళకుండా మానేశారు.

భూస్వామి ఆరోజు, టమేటా నారును ఆరవై గుంట్లకు నాటించాలనుకున్నాడు. అది అట్లే ఆగిపోయింది.

ఆగిపోయిన దాన్ని గురించి భూస్వామి కూడా పట్టించుకోలా. ఆసుపత్రికితీసక పోయిన బిడ్డకు, ప్రాణానికేమన్నా జరిగితే, తనపైన వాళ్ళేమైనా చేసి తీరుతారని గురునాథరెడ్డికి భయంగానే వుంది.

అందుకనే ఏ విషయం ముందుగానే కనుక్కొని రమ్మని సైకిల్ మోటరిచ్చి, మనిషిని పంపించాడు.

ఆసుపత్రికి పోయిన మనిషి, అన్ని విషయాలు తెలుసుకోని ప్రాణానికి పరవా లేదు, రక్తం చాలా పోయినందున రక్తమెక్కించినారు. ఇంకా రెండు రోజులుంచ మని డాక్టర్లు చెప్పిన సంగతి విన్నతర్వాత గురునాథరెడ్డికి మనసు కుదటపడింది.

సంఘం నిర్ణయం ప్రకారం నాల్గు రోజులవరకు చేలల్లో అన్నిపనులు ఆగి పోయాయి. టమేటానారు గట్టన్నే ఎండిపోవడానికి సిద్ధంగావుంది. పయిర్లు నీళ్ళు గట్టేవాళ్లు లేక, భూస్వామి ముఖంలాగానే వాడుముఖం తగిలినాయి. గొడ్లకు మేత వేసేవాళ్లు లేక గొడ్లు కొట్టంలోంచి అరుస్తున్నాయి.

గురునాథరెడ్డికి ఏమిచేయాలో తోచలేదు. అప్పటికే పిచ్చి పట్టినట్లయింది. అతను ఎపుడూ అట్లాంటి పరిస్థితిని ఎదుర్కొనలా.

చివరికి సంఘం నిర్ణయానికి కట్టుబడతానని అంగీకరించాడు. బిడ్డను కొట్టి నందుకు జుల్మానా అయిదువందల రూపాయలు, ఆసుపత్రి ఖర్చులు కట్టించాడు.

బిడ్డ క్షేమంగానే తిరిగొచ్చింది. అయిదవరోజు యథాప్రకారం, అన్ని పనులు మొదలయ్యాయి.

ఆ రోజునుండి చింతకాయలేరి, భూస్వామి ఇంటిదగ్గర కుప్పబోసే సాంప్ర దాయం మూలబడింది. రాలినకాయలు ఎవరిండ్లకు వాళ్లు తీసకపోతున్నారు.

469

* * *

ఊరు చివరనున్న ఎల్లయ్య తాత యింట్లో, బాగా చీకటిపడిన తర్వాత, సంఘంలో ముఖ్యమైన వాళ్ళ నందర్ని గంగులయ్య సమావేశపరిచాడు. అందరూ 'రాజప్ప' కోసం ఎదురు చూస్తు కూర్చున్నారు.

రాజప్పను చూసి చాలారోజులైనందున, అందరికి ఆయన కళ్ళల్లో మెదిలి నట్లుంది. అనుకొంటూ ఉండగానే రాజప్ప వచ్చేశాడు. వెంబడేవున్న కొరియర్ బయటే నిలబడి పోయాడు. రాజప్ప వస్తూనే అందరికి విప్లవాభివందనలు తెలియ చేశాడు.

అందరూ వచ్చినారని తెలియచేసిన తర్వాత 'రాజప్ప' మాట్లాడడం మొదలు పెట్టాడు.

"కామ్రేడ్స్ ప్రజాబలం ముందు అధికారబలంగాని, ధనబలంగాని నిలవలేదు. ప్రజాశక్తి అజేయమైంది. ఆ శక్తిముందు ఏ శక్తి నిలవదని పోరాటశక్తి ఋజువు చేస్తుంది. ఆ బాటలో ముందుకు సాగుతున్న మీకు నా విప్లవాభివందనాలు. మీరంతా ఐకమత్యంతో సంఘబలాన్ని బాగా పెంచారు. మీ ప్రభావంతో చుట్టు పక్కల గ్రామాలలోకి కూడా ప్రచారం ప్రాకింది. వాళ్ళ గ్రామాలలో సంఘాలు పెట్టుకోవ డానికి ఉత్సాహం చూపుతున్నారు. ఈ ఊళ్ళో పెరుగుతున్న సంఘశక్తి ప్రభావమే దానికి కారణం. ప్రచారం స్థాయినుంచి, ప్రజాపంచాయితీలు నిర్వహించే స్థాయికి ఎదిగి, ఈ రోజు భూమినాక్రమించుకోవడానికి, పోరాడడానికి మనం సిద్ధంగా ముందుకు సాగుతున్నాం.

మనం సంఘం ఏర్పాటు చేసుకున్నది భూమికోసం, భుక్తికోసమే. తరతరాలుగా మనల్ని మోసం చేసి, దగా చేసి, దోపిడీ చేసి, అన్యాయంగా ఆక్రమించిన భూస్వా ముల భూములు, పోరాటంద్వారా తిరిగి సాధించుకోవడమే సంఘం యొక్క ధ్యేయం. మనం 'దున్నేవానికే భూమి' కావాలంటున్నాం అంటె, అది అన్యాయం కాదు. ఎందు కంటె, వందలాది, వేలాది ఎకరాలు భూములున్న ఆసాములు, వాళ్ళు పుట్టేటపుడు వాళ్ళ వెంట తీసుకురాలేదు. ఎవరైనా తల్లిగర్భం నుంచి బయట కొచ్చేటపుడు రక్తాన్ని పంచుకొని పుడతాడు గాని, భూమిని వెంట పెట్టుకొని పుట్టడు. భూమి మీద పుట్టిన ప్రతి ఒక్కడికి, భూమినిదున్ని సాగుచేసే హక్కుంది. కాని కొందరు ఆ హక్కును కాలరాచి, మోసంతో సొంతం చేసుకున్నారు. వాళ్ళే భూస్వాములు. వాళ్ళు దోచుకొని దౌర్జన్యంచేస్తే భూమి వాళ్ళ సొంతమైంది. ఆ భూస్వాముల హస్తాల

నుండి, భూతల్లిని విముక్తిచేసి బిడ్డలందరికీ, భూతల్లి స్తన్యాన్ని అందించి కడుపు నింపడమే విప్లవం".

రాజప్ప చెప్పడం ఆపినవెంటనే, అందరూ ఒకే దృష్టితో మనసంతా చెప్పే దానిపైనే వుంచి, శ్రద్ధగా వింటున్న వాళ్ళు ఒక్కసారిగా వూపిరి పీల్చుకున్నారు.

"గుట్ట కింద బంజరు భూమిలో కంపచెట్లు కొట్టిచ్చి, భూసామి ... డిచెట్లు నాటతాడంటకదా! మరట్టయితే ఆ భూమిని ముందు మనమే కదా ఆక్రమించుకున్నాము. అపుడంటె పట్టా ఉండాదని బెదిరిచ్చినాడు. ఇపుడు మల్లా ఒకసారి పోయిచెప్పి, అది మాకే చెందాలనడుగుదాము ఏమంటాడో"

మూలగా కూర్చున్న ఎల్లయ్యతాత తన మనసులో మాట చెప్పాడు.

"ఆ భూమి సంగతి ఆలోసించాలనే, మనమంతా కూడింది· వాల్లు మాట్లాడ తార్లేనువు కూసో" ప్రక్కనే కూర్చున్న అతను తాతను కూర్చోమన్నాడు.

'రాజప్ప' మాట్లాడ్డం ప్రారంభించేటప్పటికి, గుసగుసలు, ఆపి అందరూ నిశ్శబ్దమయ్యారు.

"ఆ తాత చెప్పినట్టు ముందు భూమిని ఆక్రమించింది మనమే. అయితే భూస్వామి పట్టావుందని బెదిరింపాడు వదిలేసినాము, ఆరోజు మనమధ్యన ఐకమత్యం లేదు. ఈ రోజు ఐకమత్యంవుంది. ఇపుడు భూస్వామిదగ్గరకు పోయి, ఒకప్పుడు, మేము చెట్లుకొట్టి ఆక్రమించుకున్నాము. ఆభూమి మాది, కాబట్టి వదిలేయ్. అని అడిగితే, ఆయన ఊరికే వదలడు - ఇదినాభూమి, నాకే హక్కుంది అంటాడు. మీ భూమయితే పట్టా తీసుకొని రాపోండి అంటాడు. ఎందుకంటె చీమలపుట్టలోకి పామొచ్చి బుసకొట్టి, పుట్టనాక్రమిస్తాది. ఈ పుట్టమాది, మేము కష్టపడి పెట్టుకున్నాము అనిచీమలు వేడుకుంటాయి. కాని, పాము ఊరకుండదు బుసలు కొట్టి, తోకతో కొట్టి చీమల్ని చంపుతాది. ఇ చీమలే బెదిరిపోకుండా కసికట్టుగా పామును చుట్టు ముట్టితే, పాము చస్తాది.

కాబట్టి మనం భూస్వామిని వేడుకోవడంకాదు. ఆ భూమిపైన మనకు హక్కుంది. అందులో చెట్లునరికి, తిరిగి భూమిని ఆక్రమించాల్సిందే. ఇది సంఘ నాయకత్వంలో, పోరాటం ద్వారా సాధించాల్సిందే గాని భంగపాటుతోకాదు. అందువలన మీ కందరికి ఆమోదమైతే భూమిని ఆక్రమించుకోవడానికి సిద్ధం కావాలని కోరుతున్నాను."

రాజప్ప చెప్పిన దాన్ని విన్న తర్వాతే, పోరాటంద్వారా భూమిని ఆక్రమించ డానికి సిద్ధమేనని జవాబిచ్చారు.

తర్వాత 'గంగులయ్య' తన అభిప్రాయం చెప్పడానికి లేచాడు.

"కామ్రేడ్స్, ఎన్ని ఆటంకాలొచ్చినా ఎదిరించి నిలబడి భూమిని ఆక్రమించు కోవాలి. ఇప్పటికే మన ఐకమత్యాన్ని, బలాన్ని చూసి భూస్వామి బిత్తర పోతన్నాడు. భూస్వామికి అండొచ్చే వాళ్ళు ఇక్కడెవరూలేరు. వచ్చితే కలికిరో, వాయిల్‌పాడు నుంచో భూసాములండతో రావాల్సిందే. ఎవరొచ్చినా మనం ఎనకెళ్ళి పోకుండా నిలబడి పోరాడాలి. ముందు మనం చెట్లు కంపమండలు కొట్టి సదరు పెట్టాలి. మల్ల ఖండలు కట్టిద్దున్నాలి. ఇవన్ని పథకమేసుకొని చెయ్యాలి. అందుకని, ముందుగా కంపచెట్లు నరికేదానికి, ఒక్కొక్క యింట్లోనుంచి తప్పకుండా రావాలి. ఈ పనంతా రేపటినుంచే మొదలు బెట్టాలి" అని గంగులయ్య చెప్పిన అభిప్రాయాన్ని అందరూ అంగీకరించారు. అందరూ శలవు తీసుకొని వెళ్ళిపోయారు.

గంగులయ్య, గుర్రప్ప, నారాయణలు ఏవిధంగాచేయాలో రాజప్ప కార్య క్రమాన్ని వివరించాడు. అన్ని చర్చించిన తరువాత రాజప్ప, కొరియర్‌తో కలిసి వెళ్ళి పోయాడు.

*   *   *   *

కూలీల కండ బలానికి కొండలైనా కరిగిపోతాయని, ఊరి జనం చేతుల్లో ఆడిన కత్తులు, గొడ్డళ్ళ ధాటికి, అడివిలాగుండిన నలభై ఎకరాల బంజరంతా మైదాన మైంది. సుమారు రెండు లారీలు కట్టె కుప్పబడింది. కంపనంతా చుట్టూ కంచె కట్టారు.

గురునాధరెడ్డి కలికిరికి వెళ్ళి, తనబంధువులను, భూస్వాములండ కోరి కొట్లా టకు మనుషులను పిలిపించుకున్నాడు.

ఎక్కువగా ఆటంకం కల్గితే వెంటనే అరెస్టుచేసి లాకప్పులో తోసించడానికి, పోలీసులకు లంచమిచ్చి ప్లాను సిద్ధం చేసుకున్నాడు.

సూర్యుడు ఎర్రగా మెరుస్తూ పుట్టుకొస్తున్నాడు. భూమిచుట్టి రావడానికి ఎక్కడ ఆలస్యం అవుతుందో నన్నట్లుగా, పుట్టిందేతడవు పరుగులు దీస్తున్నాడు, తన తీక్షణ మైన కిరణాలు భూమి మీద వెదజల్లుతూ కొండమీదకు ఎగ బ్రాకు తున్నాడు.

కొండకు దిగదాల పోడు కొట్టిన మైదానమంతా, రణరంగం కాబోతున్నట్లుంది.

రైతులు ఎర్రజెండాలతో, మడకలు కట్టుకొని, 'దున్నేవానిదే భూమి', 'రైతు కూలీ సంఘం వర్ధిల్లాలి' అంటూ అక్కడికొచ్చారు.

భూస్వాములు ట్రాక్టరులో మనుషుల్ని తీసుకొని, కత్తులు, కటార్లతో దాడి చేయడానికి సిద్ధమై వచ్చారు.

ఇరువైపుల మాటకు మాట పెరిగింది. చేతల కాడి కొచ్చింది. "రేయి కొట్టండ్రా నాకొడుకుల్ని, వదలద్దు, పట్టుకోండి, ఎక్కించండి" అంటూ ట్రాక్టరును దున్నే మడికల మీదకు పోనిచ్చారు. కాడికి ఉన్న ఎద్దులు పరుగెత్తుకెళ్ళాయి. కొన్ని కాడి అంకెలిరిగిపోయి, అక్కడే కూలబడ్డాయి. భూస్వామి బంధువు తుపాకి పేల్చాడు.

మనుషులు చెల్లాచెదరయ్యారు. కొందరు అరుస్తూ కేకలేస్తున్నారు. కొందరు ఏడుస్తూ మొత్తుకుంటున్నారు. గూండాలు కత్తులూ, కట్టెలతో బాదుతున్నారు.

సమయానికి పోలీసులు వచ్చేశారు. పోలీసులు వచ్చినారు ఇక పరవాలేదు, రక్షిస్తారనుకొని ఆశపడ్డారు కూలీలు. కానీ పోలీసులే గూండాల కన్నా లాఠీలతో ఎక్కువగా కూలీలను బాదారు. గాలిలో తుపాకిని పేల్చారు పోలీసులు. జనం చెల్లాచెదురయ్యారు.

గంగులయ్య, నారాయుడు గురుప్పతోపాటు నలభై మందిని రెండు వ్యానుల కెక్కించుకొని, పుంగనూరు స్టేషన్‌కు తీసుకెళ్ళి కేసు నమోదు చేశారు.

సంఘంలో చురుగ్గా పనిచేసేవాళ్ళంతా, అరెస్టయి పోవడంతో భూస్వామికి ఎదురు లేకుండా పోయింది. ట్రాక్టరు పెట్టి భూమినంతా దున్నిచ్చాడు.

దౌర్జన్యంతో, పోలీసు అండతో, గూండాలతో కూలీలను బెదిరించి భూమిని దున్నించుకోగానే ఆ భూమి తనదైనట్టు, ఇంకెవరికీ హక్కు లేనట్లు సంబర పడ్డాడు గురునాథరెడ్డి.

* * * *

వారం రోజులవుతున్నా అరెస్టు చేసిన వారిని ఎవరినీ కూడా కోర్టులో ప్రవేశ పెట్టకుండా స్టేషన్‌లో చిత్రహింసలు పెట్టారు.

జిల్లా అంతటా ఆందోళన ప్రారంభమైంది. పౌరహక్కుల సంఘం, రాడికల్ యువజన సంఘాలు, కరపత్రాలు కొట్టించి, పోస్టర్లువేసి, అక్రమ అరెస్టుల్ని ఖండిస్తూ ప్రచారం సాగించింది.

"భూస్వాముల జులుం - నశించాలి.

అక్రమ అరెస్టుల్ని - ఖండించండి.

అరెస్టయిన కామ్రేడ్స్‌ను వెంటనే - విడుదల చేయాలి" అంటూ విద్యార్థులు - యువకులు, స్త్రీలు ఊరేగింపుగా సాగారు. కోర్టుదగ్గర పికెటింగ్ ప్రారంభమయింది. పాటలతో నినాదాల హోరుతో కోర్టు పునాదులు కదుతున్నాయా అన్నట్లు ధ్వని పలుకుతోంది.

అన్యాయస్థానంలో కళ్ళకు గంతలు కట్టి బంధించబడిన న్యాయదేవతకు చూపులేకాదు, చెవులు కూడా వినిపించకుండా సీసం పోశారేమో. అందుకనే స్వేచ్ఛ కోసం, న్యాయంకోసం, హక్కుల కోసం గొంతెత్తి అరుస్తున్న బిడ్డల పిలుపు ఆమెకు సోకనైనా లేదు.

జనం గుంపులు గుంపులుగా గుమికూడుతున్నారు. జనంతో పాటుగా పోలీసులు కూడా తుపాకులతో, లాఠీలతో అక్కడికొచ్చేశారు.

సన్నగా మెరికలాగా ఉన్న యువకుడు కోర్టు వరండాలో ఎత్తుగా వున్న చోటునుంచి మాట్లాడుతున్నాడు.

"ప్రజలారా! రాడికల్స్ ఎవరన్న సంగతి మీకందరకు తెలుసు, ఎందుకంటె ఈ రోజు రాడికల్స్ ప్రభావం లేని జిల్లా అంటూ లేదు. వాళ్ళ ప్రజలలో బిడ్డల్లాగా కలిసిపోయారు. అట్లాగే మన జిల్లాలో కూడా పేద ప్రజల్ని కూడగట్టి, రాడికల్ యువజన సంఘాలు, రైతుకూలీ సంఘాలు ఏర్పాటు చేసి భూస్వాములకు వ్యతిరేకంగాను, లంచగొండితనానికి, అన్యాయాలకు, అక్రమాలకు వ్యతిరేకంగాభూమికోసం, భుక్తికోసం పోరాడుతున్నారు. పేద ప్రజలంతా సంఘాలు పెట్టుకొని పోరాడుతుంటె, భూస్వాములు తమ పునాదులు కదులుతున్నాయని, తమ పెత్తనం పోతున్నదని బెంబేలెత్తిపోతున్నారు. పేద రైతాంగం మీద, కూలీల మీద దాడులు సాగిస్తున్నారు. భూస్వాముల అన్యాయాలు అరికట్టలేని పోలీసులు, భూస్వాములకు తొత్తులుగా మారి, కూలీల మీద అక్రమ కేసులు బనాయించి, అరెస్టులుచేసి, స్టేషన్లలో చిత్రహింసలు పెడుతున్నారు.

"రామిరెడ్డిగారి పల్లెలో భూస్వామి అక్రమంగా ఆక్రమించిన బంజరు భూమిని పేదలంతా కలిసి చెట్టు, పుట్ట కొట్టుకొని దున్నుకుంటూ వుంటే గూండాలచేత కొట్టించి, కేసులు పెట్టి నలభైమందిని అరెస్టు చేపించాడు. ఇప్పటికి వారంరోజులవుతున్నా

కోర్టులో హాజరు పరచలేదు. వారిని హింసిస్తున్నారు. అందుకే మేము చెబుతున్నాం. ఈ పోలీసులు, కోర్టులు, ప్రభుత్వాలుండేది పేదవారి కోసం కాదు. పెత్తందార్లకు ఊడిగం చేయడానికేవున్నాయి. కాబట్టి మీరు బాగా ఆలోచించండి. ఈ రోజు తంబళ్ళ పల్లి, వాయిల్పాడు, మదనపల్లి, పుంగనూరు తాలూకాలలో రైతాంగం మీద భూస్వాములు, పోలీసులు కలసి విపరీతంగా దాడులు చేస్తున్నారు. అయితే మీరు ఈ జరుగుతున్న దాడులు మా మీద కాదులే అని అనుకొని గమ్మున వుండొచ్చు. కాని, ఆ దాడులు అక్కడ వాళ్ళకే పరిమితం కాదు, రేపు మీ గ్రామాల్లో కూడా, హక్కుల కోసం, న్యాయం కోసం అడిగితే, అపుడు మీ మీద కూడా దాడులు సాగిస్తారు. అందుకే ప్రజాస్వామిక వాదులంతా రైతాంగంపై జరుగుతున్న పోలీసు, భూస్వాముల దాడులను ఖండించి అరెస్టు చేసినవారి విడుదలకై డిమాండు చేస్తూ, వారి పోరాటానికి మద్దతివ్వాల్సిందిగా కోరుతున్నాం".

విద్యార్థి నాయకులు చెప్పిన మాటలు విని, కరతాళధ్వనులతో మద్దతు తెలిపారు.

"రైతుకూలీ సంఘం – వర్థిల్లాలి
అరెస్టయిన కామ్రేడ్స్‌ను – వెంటనే విడుదల చేయాలి" అంటున్న నినాదాలు తారాస్థాయి నందుకున్నాయి.

* * *

అరెస్టయిన కామ్రేడ్స్ అందరూ విడుదలైవచ్చారు. ఆ రోజే మడకలు కట్టుకొని, ఎర్రజెండాలతో ఊరేగింపుగా కొండ కిందకు కదిలారు.

భూస్వామి ట్రాక్టరుతో దున్నిన భూమిని తిరిగి మరలా దున్నారు.

దుక్కి బాగా దున్నిన తరువాత, అదను చూసి భూమిలో ఉలవ గింజలు చల్లారు. కొంత భూమిలో టమేటా చెట్లు నాటారు.

మంచి అదనులో పడిన ఉలవ గింజలు బాగా మొలిచాయి.

సంఘం బలం మరింతగా పుంజుకొని, దెబ్బలు, చిత్రహింసలు తట్టుకొని ముందుకు సాగుతున్నట్టుగానే ఉలవ పైరు, టమేటా చెట్లు కూడా బాగా పెరుగుతున్నాయి.

475

కొండ కింద భూమికి 'సంఘమోళ్ల భూమి' అని పేరు పడిపోయింది.

భూస్వామి గురునాధరెడ్డి ఊళ్ళో వచ్చిన మార్పును చూసి, మింగలేక, కక్క

లేక కోరలు పెరికిన నాగులాగా బుసలు కొట్టుకుంటున్నాడు.

మునుపటి మాదిరిగా కూలీలు ఎవరూ అతన్ని లెక్క చేయడంలేదు. గురునాథ రెడ్డి ఇంటిని వదలి రాకుండా ఉన్నాడు.

గురునాథరెడ్డి తెల్లవారి పేపరులో ముందు పేజీలో పెద్దక్షరాలతో పడిన "కలికిరిలో భూస్వామి హత్య" అనే వార్తను చూసేటప్పటికి నోటినుండి మాట రాకుండా, ఒళ్ళంతా చెమటపట్టి ఒనుకు పుట్టనారంభించింది.

వార్తను చూసినప్పటి నుండి వారం రోజులు అన్నం తినడం మానేశాడు. తనకు నిద్రలోకూడా కలవరింతలొస్తున్నాయి.

ఆ రోజు సాయంత్రం కానూరు నుంచి తన స్నేహితుడు సర్పంచి రాజిరెడ్డిని పిలిపించాడు.

"ఏమన్నా, అర్జెంటుగా రమ్మన్నావంట ఏమి సంగతి" అంటూ సర్పంచి పరుగెత్తు కొచ్చాడు.

"ఏమీలేదు చిన్న పనుంటె రమ్మన్నాను. నీతో వాడు గంగులుగాడు, బాగానే మాట్లాడతాడు కదా" గురునాథరెడ్డి.

"ఏ గంగులుగాడు, ఎవురన్నా నువు చెప్పేది?" సర్పంచికి విషయం అర్థం కావడం లేదు.

"అదేనయ్యా సంఘమోళ్ళ సంగతి, వాడు మాలోడు; గంగులుగాడు సంగతి నేను చెప్పేది". సంఘం అనడం గురునాథరెడ్డి కిష్టముండదు. మాలోడు అనడమే తన కిష్టం కాబోలు.

సంఘమోళ్ళు అనేటప్పటికి, గురునాథరెడ్డికన్నా రెండింతలుగానే సర్పంచికి భయమేసింది, నాలిక మీద తడారిపోయింది.

"ఈడు నాకు, వాళ్ళకే ఎమన్నా, జుట్లు ముడేయాలనుకుంటున్నాడో ఏమొ. వాడి మాదిరిగానే నేను కూడా చికులాడై వాడికి సంతోషం" అని మనసులో అనుకున్నాడు సర్పంచి.

పైకి మాత్రం "అబ్బే, ఏమంటె ఏమని అనడమేగాని, అసలు నాకూ వాళ్ళకూ సంబంధమే లే...." అని సర్పంచి నసుగుతూ అంటూ వుండగానే గురునాథ రెడ్డి మధ్యలోనే అందుకున్నాడు.

" నీకు వాళ్ళతో సంబంధాలుండాయని అనుమానించడం లేదులే గాని, వాడితో నా గురించి మాట్లాడాల. అదే భూమి సంగతి తకరాదా ఉండాది కదా ! దాని విషయంలో నేను రాజీ పడతాను అని వాడితో ఒక మాట చెప్పి మా మధ్యన రాజీ చెయ్యాల. అందుకోసమే నిన్ను పిలిపించింది." గురునాథరెడ్డి అసలు విషయం చెప్పేటప్పటికి, సర్పంచి రాజిరెడ్డికి భయమంతా తొలగి పోయింది.

476

"అయ్యో, ఆ విషయానికింత చెప్పాలంటన్నా. నేను పోయి మాట్లాడతానులే. నువ్వు హాయిగా వుండు" సర్పంచి అభయమిచ్చినట్టు చెప్పాడు.

ఏదో మధ్యవర్తిగా వుండి, తానే ఆపని చెయ్యగలిగానని, సంఘమోల్ల దగ్గర గంగులయ్యతోను మెప్పు పొంది, భవిష్యత్తులో తనమీద సంఘమోల్ల దృష్టి పడకుండా చేసుకోవచ్చనుకున్నాడు.

వెంటనే సర్పంచి, గంగులయ్య దగ్గరకెళ్ళి రాజీ అయ్యే విషయం చెప్పాడు.

"రాజీ పడదలచుకుంటె, ఆ చెప్పేదేదో సంఘం సమచ్చంలోనే చెప్పాల, అంతే, చాటుమాటు బేరాలు, మంతనాలు పనికిరావు" గంగులయ్య ఆ మాట అనేసి సమాధానం కోసం ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు.

భూస్వామి ఒకవైపు సంఘమోల్లతో, రాజీ బేరాలు సాగిస్తూనే మరోవైపు తన రక్షణ కోసం, లంచం పోసి, తన యింటి దగ్గర పోలీసు క్యాంపు పెట్టించుకున్నాడు.

*　　　*　　　*

పోలీసు క్యాంపు పెట్టడంతోనే ఊరివాతావరణంమారిపోయింది. ఊరికియమభటులొచ్చినట్లయింది. ప్రతిరోజు ప్రొద్దుకుంకిన వెంటనే అందరి ఇండ్లల్లోను ఒకటే గోల.

"ఏమమ్మే రామక్కా! మాది గుడ్లు పెట్టేకోడి, నల్లపెట్ట అవపడ లేదమ్మే మీ ఓటిల్లో ఏమన్నా వచ్చిందేమో చూడు" అని ఒకామె అంటె.

"మాది కూడా పూలకోడి, పుంజు అవపడలేదక్కా! దానికోసమే ఎతికెతికి అల్లాడితన్నా" అంటూ ఎదురింటామె జవాబు.

"మనూరొచ్చినారు కదె! రాచ్చేసులు! యాడకోళ్ల వాళ్ళ బాన కడుపులకు సాలడంలే, ఇంకెందుకే ఎతకడం దండగ. ఆపెట్టదాన్ని, పుంజును రెంటిని, ఆ పోలీసు నాబట్టలే కోసుకోనుంటారు పోండి" ఇంకో ముసిలామె ఉన్నది ఉన్నట్టు చెప్పుతుంది.

ప్రతిరోజు ఊర్లో అదేవిధంగా వుంటుంది.

క్యాంపు పెట్టినప్పటి నుండి, గంగులయ్యకోసం గాలిస్తూనే వున్నారు. రాత్రుళ్ళు ఊరు మీద దాడిచేయడం, సంఘమోళ్ళు వచ్చినారంట, ఎక్కడ చెప్పండని వేధించడం జరుగుతోంది.

గంగులయ్య రహస్యంగానే, కార్యక్రమాలు సాగిస్తున్నాడు. అయితే నాయకుడు రాజప్ప కలవడానికి వీలుండడంలేదు. క్యాంపు వచ్చిన తరువాత గంగులయ్యకు సరిగా సమాచారం అందటం లేదు.

*　　　*　　　*

సాయంత్రం సూర్యుడు చల్లబడుతున్నాడు. క్యాంపు ముందు సెంట్రీ, ఆ దారిన ఎవడన్నా వస్తాడేమో, అని కాచుకోని వున్నాడు. లోపల హెడ్డు, కాలుకాలు మీద, వేసుకోని పండు కోనున్నాడు. మిగతా పోలీసులు ఊరిమీద గస్తీకెళ్ళారు,

నెత్తిన కట్టెలమోపెత్తుకోని దూరంనుంచి వస్తున్నకుర్రాడు, సెంట్రీచూపులో పడ్డాడు.

"సార్ దూరంగా, ఒక కుర్రోడు కట్టెలమోపెత్తుకోని వస్తన్నాడు సార్" సెంట్రీ హెడ్డుకు చెప్పాడు.

"అది కూడా నాకు చెప్పాలంటరా పిల్చి నాలుగుతన్ని పనికి పురమాయించు. త్వరగా అవ్వాల నాకు ఆకలిగా వుంది." హెడ్డు కోపంగా ఆర్డరిచ్చాడు.

హెడ్డుగారి ఆర్డన్ని శిరసావహించిన సెంట్రీ, కుర్రాడిని కేక వేసి పిలిచాడు.

"రేయ్ కట్టెల మోపోడా, నిన్నే, ఇట్ల రారా ?"

పిల్లవాడు భయపడుతూ క్యాంపు దగ్గర కొచ్చాడు. "ఏమోయ్ పిలస్తా వుంటె, యినపడలా, దర్జాగా, దొరకొడుకు మాదిరిగా ఈలేసుకుంటూ పోతున్నవే." అంటూ తలమీద దెబ్బవేశాడు. అప్పటికే పిల్లోడు మోపుకింద పడేశాడు.

"అయ్య పిలుస్తున్నాడు లోపలికిపదా" అంటూ హెడ్డు దగ్గరకి లాక్కెళ్ళాడు.

"ఏమోయ్ పమ్మల్నిచూసి ఈల వేసుకుంటు పోతన్నావా? ఆ—" గదమాయించాడు హెడ్డు.

"లేదుసా, నేను గమ్మన్నే పోతన్నా సా దండంపెత్తా నన్ను కొట్టొద్దు సా" పిల్లవాడు.

"నీకు కోడిని కోసే దొస్తాదా రా" హెడ్డు.

"నేనెప్పుడూ కొయ్యలా సా" పిల్లవాడు.

"పోయి, కాసేప్ పో, అదే వస్తాది. లేకుంటె కీళ్ల యిరిచేస్తాం" అంటూ పోలీసు పూత్రం చెప్పి, ఒకతన్ను తన్నాడు.

సెంట్రీ పిల్లవాణ్ని, వెనక్కి పిల్చుకొనిపోయి, ప్రాణం తీసేసిన రెండు కోళ్ల చూపించి, త్వరగా పనికానిమ్మని చెప్పాడు.

అప్పటికే అలసిపోయిన పిల్లోడు ఏడ్చుకుంటూ ఈకలు పెరకడం ప్రారంభించాడు.

వాటిని కాల్చి కోసేటప్పటికి బాగా చీకటిపడింది.

"మాఅమ్మ తిడతా ఉంటాది నేను పోతా సా" పిల్లవాడు ఒనుకుతూ అడిగాడు.

"ఏం రా కోడిని కొయ్యమంటె ముందు రాదంటివే. ఇపుడు ఎవరు నేరిపించినార్రా ? మీ అమ్మ నేరిపిందంటరా, లంజకొడకా" అంటూ హెడ్డు, పిల్లవాడి కడుపు మీద తన్నాడు.

"అమ్మా!" అంటూ పిల్లవాడు క్రింద పడిపోయాడు. పడిపోయినవాడిని జుట్టు పట్టిలేపి "మీయిండ్లకు రాత్రుళ్లు సంఘమోళ్ళు ఎవురోస్తారో, ఎక్కడి కొస్తారో చెప్పు."

478

"తెలీదుసా, నాకు నిజంగా తెలీదుసా" పిల్లవాడు ఒనుకుతూ ఉచ్చ కార్చేశాడు.

"పో, పోరా నాకొడకా బయటకుపో " హెడ్డు.

"లంజాకొడకా బొమ్మ మాదిరిగా చూస్తన్నావు. తరుమువాణ్ని " సెంట్రీని తిట్టాడు హెడ్డు.

పిల్లవాడు ఇదే సందుగా, కట్టెలమోపును కూడా వదిలిపెట్టి, ఇంటికి పరుగు దీశాడు.

పిల్లవాడు జరిగినదంతా ఊర్లోవాళ్ళకు చెప్పాడు. జనం క్యాంపు దగ్గరికి పరుగు తీశారు.

గస్తీకెళ్ళిన పోలీసులు ఒక యువకుడ్ని జుట్టుపట్టి ఈడుస్తున్నారు. అతను రానంటూ పెనుగులాడుతున్నాడు.

"ఎవడ్రావాడు, ఏమి సంగతి అంటూ హెడ్డుగాడు అక్కడి కొచ్చేశాడు.

"వీడు, మన మీద, రాడికల్స్ వేసిన కరపత్రాలు పంచుతున్నాడు సార్, అందు కని పట్టుకోని, మీ దగ్గరికి రమ్మంటె రానంటున్నాడు సార్" పోలీసులు వివరించారు.

"ఏంరా సాలె పిలిస్తే ఎందుకు రావురా లంజాకొడకా, తలేమన్నా తిరుగుతాందా" హెడ్డు కొట్టేదానికి చెయ్యెత్తాడు.

ఆ సమయానికే, జనం, గుంపులు, గుంపులుగా, కేకలేస్తూ, వచ్చేశారు.

"నాకొడుకులు చంపేస్తారు, పరుగెత్తండిరా, క్యాంపుకాడికి" హెడ్డుగారు పరు గెత్తాడు.

పోలీసులు, హెడ్డును అనుసరిస్తూ, చస్తిమో, బతికితిమో అనుకుంటూ, టెంటులోకి దూరారు.

జనం అదే అదునుగా, తమకు నోటి కొచ్చినట్లు తిట్టి కక్షతీర్చుకున్నారు.

గురునాధరెడ్డి ఇంటిలోనుండి, తతంగం అంతాచూస్తూ, తలపట్టుకొని కూర్చొని చూస్తున్నాడు. ఈ సమయంలో యింటి మీద పడితే ఇక దేవుడే దిక్కనుకున్నాడు.

* * *

రాత్రి బాగా చీకటి పడినాక. గంగులయ్య యింటికి వెళ్ళాడు. పక్కవల్లె కానూరు నుండి వచ్చిన మనిషి తన కోసం కాచుకోనున్నాడు.

అతనివెంట గంగులయ్య వెళ్ళాడు. అక్కడ రాజప్ప తనకోసం ఉన్నాడు. రాజప్పనును చూసేటప్పటికి, గంగులయ్యకు తన మనసులో ఆనందమంతాఒక్క సారి పెల్లుబికి నట్లయింది.

479

ఒకరినొకరు పిడికిలెత్తి రెడ్ శాల్యూట్స్ చెప్పుకున్నారు.

గంగులయ్య ఊరిలో విషయాలు అన్ని చెపుతుంటె, రాజప్ప శ్రద్ధగా వింటున్నాడు.

"రాజన్నే, కేసు చానా రోజుల్నించి ఆలోసించి ఆలోసించి, ఈ పొద్దు ఒక మాట చెప్పాలను కుంటున్నా, అన్నా".

గంగులయ్య తనలోని సంఘర్షణ బయట పెట్టాడు.

రాజప్ప దాని గురించి ఆలోచిస్తూనే "సరే చెప్పు గంగులన్నా" అన్నాడు.

"నేను పూర్తికాలం పనిచెయ్యాలని నిర్ణయించుకున్నాను. నన్ను పార్టీలో చేర్చుకోండన్నా. ఏ పని చెయ్యడానికైనా నేను సిద్ధమే!" గంగులయ్య.

రాజప్ప కళ్ళకు గంగులయ్య చాలా ఎత్తు ఎదిగినట్లు అగుపించాడు. ఆనందంతో కౌగిలించు కున్నాడు. మరోసారి గంగులయ్యకు రెడ్ శాల్యూట్స్ చెప్పాడు.

గంగులయ్యను నిర్ణయాన్ని రాజప్ప సంతృప్తిగా అంగీకరించాడు . తాను అడగాలనుకున్న విషయాన్ని గంగులయ్యె చెప్పి ఆనంద పరిచాడు.

గంగులయ్య నిర్ణయాన్ని, రాజప్ప, పార్టీకి తెలియచేశాడు. పార్టీవాళ్ళు ఆమోదించి మంచి కార్యకర్తగా తయారైనందుకు విప్లవాభివందనాలు తెలియచేస్తూ తాలూకా ఆర్గనైజరుగా భాధ్యత అప్పచెప్పారు.

* * * *

పార్టీ నిర్ణయాన్ని గంగులయ్యకు చెప్పడానికి, ఒకరోజు రాత్రి చాలా ప్రొద్దు పోయాక రాజప్ప రామిరెడ్డి పల్లె కొచ్చాడు.

గంగులయ్య పార్టీ యిచ్చిన బాధ్యతను ఆనందంగా స్వీకరించాడు.

తెల్లవారు జామునలేచి, రాజప్ప, గంగులయ్య ఇద్దరూ బయలుదేరారు. కాలిబాటన నడుచుకుంటూ రోడ్డెక్కేటప్పటికి ఆకాశంలో చీకటి మబ్బులా మటుమాయమౌతూ, తూరుపు కొండల్లోనుంచి సూర్యుడు ఎర్రగా నిప్పు కణికలాగా పుట్టుకొస్తున్నాడు.

ఆ పూర్లో మట్టిమనిషిలాగా బతికిన గంగులయ్య, రాడికల్స్ రాజకీయాలతో ఊరుతో పాటుగా, తానూ చైతన్య వంతుడై పోరాటంలో రాటుతేలి, వందలాది ఊర్లను తనవూరుగా, ప్రజలందరిని తనవాళ్ళుగా ఎంచుకోని, ఊరూరులోను ఎర్రజెండా ఎగురేయడానికి, "పోరాట సూర్యుడ్ని" వెలిగించడానికి, రాజప్పతో కలసి తూర్పుదిశగా పోతున్నాడు.

480